# సాక్షి
## అన్నమయ్య జిల్లా

బుధవారం, 9, అక్టోబర్, 2024

I




### విశాఖ జట్టు విజయభేరి
కడపలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖ జట్టు విజయభేరి మోగించగా, ప్రకాశం, చిత్తూరు జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. -IIలో



### బంగారు నగలు, నగదు చోరీ
రైల్వేకోడూరు పట్టణం కొత్త కోడూరులో చోరీ జరిగింది. సుమారు రూ.20 లక్షలు విలువ చేసే బంగారు నగలు, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. -IIలో

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.780 | రూ.840 |
| రెండోరకం | రూ.600 | రూ.780 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 95 మెట్రిక్ టన్నులు

**పట్టుగూళ్ల ధరలు (రూ.లో)**



| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 438 | 438 |
| సీబీ | - | - |

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 34.220 కిలోలు

## న్యూస్‌రీల్

### విత్తన శుద్ధి తప్పనిసరి



రైతులకు సూచనలు ఇస్తున్న జేడీఏ చంద్రనాయక్

సంబేపల్లి: మండల పరిధిలోని ఎస్.సోమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ కిషోర్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జేడీఏ చంద్ర నాయక్ హాజరై రైతులనుద్దేశించి మాట్లాడుతూ వేరుశనగ పంట సాగులో విత్తనశుద్ధి ప్రాముఖ్యత వివరించారు. అలాగే పలు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ శిక్షణ

రాయచోటి (జగదాంబసెంటర్): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా 5050 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించిందని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ ఎస్.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణా సంస్థలలో, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్‌లో నిర్వహిస్తారన్నారు. ఎంపానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలని, గత డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో కనీసం వంద మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొంది ఉండాలన్నారు. 3 సంవత్సరాల సరాసరి టర్నోవర్ కనీసం రూ.40 లక్షలు ఉండాలన్నారు. డీఎస్సీ శిక్షణ సంస్థలను ఎంపానెల్ చేయుటకు కావాల్సిన వివరాలతో ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు ఇతర వివరాల కోసం ఈఓఐ డాక్యుమెంట్‌ను ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 21 చివరి తేదీ అని ఆయన తెలియజేశారు.

### నిత్యాన్నదానానికి లక్ష విరాళం

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రూ.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన కుప్పన్నగారి సంజీవరెడ్డి కుమారుడు రామాంజనేయరెడ్డి కుటుంభ సభ్యులతో వచ్చి విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి, సూపరింటెండెంట్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక కౌంటర్లలో వంట నూనె, నిత్యావసర వస్తువుల విక్రయం



మాట్లాడుతున్న జేసీ ఆదర్శరాజేంద్రన్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరలలో వంట నూనె, టమాటా తదితర నిత్యావసర వస్తువులు అందుబాటులోకి తెస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పండుగ సీజన్‌లో ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండేలా జిల్లాలోని వ్యాపారస్తులు సహకరించాలన్నారు. తక్కువ ధరలలో నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించిన చర్యలను వెంటనే తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ అధికారులను జేసీ ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక కౌంటర్లలో వంట నూనె, తదితర నిత్యావసర వస్తువుల ధరలను కమిటీ నిర్ణయించింది. ప్రియ గోల్డ్ వంటనూనె మార్కెట్ ధర రూ.128 ఉండగా ప్రత్యేక కౌంటర్లలో రూ.122, ఫ్రీడం సన్‌ఫ్లవర్ నూనె మార్కెట్ ధర రూ.140 ఉండగా ప్రత్యేక కౌంటర్లలో రూ.133, ఎవరీ డే గోల్డ్ నూనె ధర మార్కెట్లో రూ.137 ఉంటే ప్రత్యేక కౌంటర్లలో రూ.130 ఉంటుందని తెలిపారు. టమాటా ధరను రూ.50లుగా నిర్ణయించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల డీఎం శివరాం, ఏడీ మార్కెటింగ్ త్యాగరాజు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం, కొలతలు తూనికల శాఖ అధికారి, జిల్లాలోని ప్రముఖ వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ఎన్నికల వేడి..!

**సాగునీటి వినియోగదారుల సంఘాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఎనిమిది రోజుల్లో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రి ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో నీటిపారుదలశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. సాగునీటి సంఘాలు, వాటి పరిధిలో (రైతులు)ఓటర్లు, విస్తీర్ణంపై లెక్కలు తేలుస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా సమగ్ర వివరాలను సిద్ధం చేసుకునేలా అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.**

- ఎన్నికల షెడ్యూల్‌కు కసరత్తు
- 16 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- చిన్న నీటి పారుదల కింద 164 నీటి సంఘాలు
- పెద్ద, మధ్యతరహా నీటిసంఘాలు లేనట్లే
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేనా..?
- రైతు సంఘాలలో అనుమానాలు
- పదవుల కోసం కూటమి నేతల పైరవీలు



ప్రతీకాత్మక చిత్రం

రాజంపేట: సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సాగునీటి సంఘాలు, వాటి పరిధిలో (రైతులు)ఓటర్లు, విస్తీర్ణంపై లెక్కలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. కాగా.. సాగునీటి సంఘాలకు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015 సెప్టెంబరు మాసంలో ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో అధికార దర్పంతో మెజార్టీ సంఘాలను వారు కైవసం చేసుకున్నారు. దీనిపై రైతుల్లో అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు కూడా వచ్చాయి. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించలేదు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పి వాటి ద్వారా అన్ని రంగాలను సమన్వయం చేస్తూ ముందుకు నడిపించారు. రైతులకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందారు. తాజాగా మళ్లీ సాగునీటి సంఘం ఎన్నికలు తెరపైకి వచ్చాయి. నీటి సంఘాలకు రెండేళ్ల పదవీ కాలం ఉంటుంది. నీటిసంఘాల పదవుల కోసం కూటమి నేతలు పైరవీలు మొదలుపెట్టారు. ఈ నెల16 నుంచి సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రక్రియను అధికార యంత్రాంగం మొదలుపెట్టనున్నది.

**నీటిసంఘాలిలా..**

చిన్ననీటిపారుదల కింద 164 సంఘాలు ఉన్నాయి. ఇందులో 94 ఉమ్మడి వైఎస్సార్ జిల్లా, 70 సంఘాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నాయి. పెద్ద, మధ్య తరహా నీటి వినియోగదారుల సంఘాలు లేకపోవడం గమనార్హం.

**రెండు ప్రాజెక్టులున్నా..**

జిల్లాలో వెలిగల్లు, అన్నమయ్య జలాశయాలు ఉన్నాయి. ఇవి మధ్యతరహా ప్రాజెక్టులు. అయితే వెలిగల్లు కింద నీటి సంఘాలు లేవు. అన్నమయ్య జలాశయం కొట్టుకుపోవడంతో నీటిసంఘాలు లేని పరిస్థితులు నెలకొన్నాయి.

**ఎన్నిక ఇలా:** నీటి వినియోగదారుల సంఘానికి ఆరుమంది ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోవాలి. వారి నుంచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. నీటి సంఘానికి అధ్యక్షున్ని ఎగువ ప్రాంతాల నుంచి, ఉపాధ్యక్షుడు దిగువప్రాంతాల నుంచి ఎన్నుకోనున్నారు.

**ఏకపక్షం కాదు..**
**ఏకాభిప్రాయంతోనే ఎన్నికలు..**

ఏకపక్షం కాదు.. అంతా ఏకాభిప్రాయంతోనే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేలా 2013లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 2015 సెప్టెంబరులో చంద్రబాబు సర్కారు హడావుడి చేస్తూ ఏర్పాట్లు చేసింది.

### గతంలో టీడీపీకి అనుకూలంగా...

టీడీపీకి అనుకూలంగా మార్చుకునేలా ఏపీ ఫార్మర్స్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్(ఈఎస్ సిస్టమ్ యాక్ట్ 1997)కు సవరణ చేస్తూ ఏకాభిప్రాయం పేరిట చీకటి జీవోను తీసుకొచ్చారు. రైతుమధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏం చేయాలనే అంశంలో జీవోలో స్పష్టత లేదు. దీన్ని అధికారపార్టీ నేతలు ఆసరాగా చేసుకున్నారు. ఏకాభిప్రాయం ముసుగులో తమ అనుయాయులకు పదవులన్నీ కట్టబెట్టారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతు సంఘాలు అడ్డగించినా ఎన్నిక ప్రక్రియ ముగించేశారు. దీంతో రైతుల మధ్య అప్పట్లో ముష్టియుద్ధాలు నడిచాయి. ప్రస్తుతం ఎన్నికలు నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేలా కృషి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### ఎన్నికలు పటిష్టంగా నిర్వహిస్తాం

రాయచోటి: ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలను అనుసరించి జిల్లాలోని చిన్న నీటిపారుదల కింద ఉన్న 164 నీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ వివరించారు. మంగళవారం విజయవాడ నుండి రాష్ట్రంలోని పెద్ద, మధ్య , చిన్న తరహా నీటిపారుదల కింద ఉన్న నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై జిల్లా కలెక్టర్లు, జల వనరుల శాఖ అధికారులతో రాష్ట్ర జల వనరుల అభివృద్ధిశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు రాయచోటి కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా పరిధిలో పెద్ద, మధ్య తరహా నీటి వినియోగదారుల సంఘాలు లేవన్నారు. చిన్న నీటిపారుదల కింద 164 సంఘాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో 94 సంఘాలు ఉమ్మడి కడప జిల్లా, 70 సంఘాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో వెలిగల్లు, అన్నమయ్య రెండు మధ్య తరహా ప్రాజెక్టులు ఉన్నప్పటికీ వెలిగల్లు ఆయకట్టు పరిధిలో నీటి వినియోగదారుల సంఘాలు లేవన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడం జరిగిందన్నారు. ప్రతి నీటి వినియోగదారుల సంఘం ఆరు ప్రాదేశిక నియోజకవర్గాలను కలిగి ఉంటుందన్నారు. వాటిలో 3 ఎగువన, 3 దిగువ ప్రాంతాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్సుకు డీఆర్‌ఓ సత్యనారాయణరావు, ఆర్డీఓ రంగస్వామి, జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.



### ఉన్నత విద్యకు ఉపకార వేతనాలు

కడప ఎడ్యుకేషన్: పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం స్కాలర్‌షిప్ టెస్టును ఈ నెల 26న నిర్వహించనున్నట్లు షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖదీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటకలోని బీదర్‌లో తమ ఇన్‌స్టిట్యూట్ నుంచి వేల మంది మెడిసిన్, ఇంజినీరింగ్ సీట్లు పొందారని, విద్యార్థుల ఉన్న విద్యను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఈ రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 22వ తేదీలోపు తమ వెబ్ సైట్ www.shaheengroup.org/cuetలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైన విద్యార్థులకు ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్: 85498 97767, 1800 121 6235 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

## శ్రీకరి.. శుభకరి.. లోకరక్షాకరి



అమ్మవారిశాలలో శ్రీగజలక్ష్మీదేవి అలంకారం



ప్రొద్దుటూరు రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనలక్ష్మీ అలంకారం

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవీ శరన్నవరాత్రుల వేడుకలు కన్నుల పండువగా సాగుతున్నాయి. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం ఐరావతంపై శ్రీగజలక్ష్మీదేవి అంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవతామూర్తుల సెట్టింగ్ విశేషంగా ఆకట్టుకుంది. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో సంతానలక్ష్మీదేవి, శివాలయం, గౌరమ్మకట్టలో మంగళ గౌరిగా, వైఎంఆర్ సాయిబాబా ఆలయంలో వారాహి దేవిగా, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అన్ని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

## పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

**జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్**

రాయచోటి: ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీలలో ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ నుండి జిల్లా కలెక్టర్లు, ఉపాధి హామీ సమన్వయశాఖల అధికారులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అక్టోబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు చేపట్టే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై డిప్యూటీ కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సుకు రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఆగస్టు 23న జిల్లాలో నిర్వహించిన గ్రామసభల ద్వారా రూ. 71 కోట్ల విలువైన పనులకు తీర్మానాలు చేశామన్నారు. ఇప్పటికే రూ. 65 కోట్లు విలువైన పనులకు పరిపాలన మంజూరు ఉత్తర్వులు జారీ చేశామని కలెక్టర్ మంత్రికి వివరించారు. చేపడుతున్న పనులకు సంబంధించి ఇసుక, సిమెంట్ కొరత లేదన్నారు. జిల్లాలో అక్టోబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో భూమిపూజలు, శంకుస్థాపనల ద్వారా పనులు ప్రారంభించేందుకు రూట్ మ్యాప్ సిద్ధంగా ఉందన్నారు. పనులను సంక్రాంతి పండుగలోగా పూర్తి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

# టమాటా అధరహో..!

- కిలో రూ.84
- ఇతర రాష్ట్రాల్లో భారీగా తగ్గిన సరుకు
- వైరస్ కారణంగా తగ్గిన దిగుబడి
- ఈ నెలంతా ఇదే ధర ఉండే అవకాశం



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మదనపల్లె సిటీ: ఇన్నాళ్లు హెచ్చుతగ్గుల నడుమ కొనసాగిన టమాటా ధరలు గత పది రోజులుగా అధరహో అనిపిస్తున్నాయి. మదనపల్లె వ్యవసాయశాఖ డివిజన్‌లో టమాటా అధికంగా సాగవుతుంది. మంగళవారం 10 కిలోల బాక్సు ధర రూ.840 పలికింది. బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు జిల్లాలోని మార్కెట్‌లకు వస్తుండటం, ఇదే సమయంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో సరుకు తగ్గడం, తమిళనాడులో సీజన్ ముగియడం, కర్ణాటకలో వైరస్ తెగుళ్ల కారణంగా ధరల పెరుగుదలకు కారణమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు. టమాటా పంట చేతికొస్తున్న రైతులకు ప్రాణం లేచివచ్చింది. ధరలు గిట్టుబాటుగా ఉండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**బయటి వ్యాపారుల చూపు ఇటువైపే..**

మదనపల్లె మార్కెట్‌కు సీజన్ సమయంలో 1500-2000 మెట్రిక్ టన్నుల వరకు సరుకు వస్తుంది. ప్రస్తుతం 80-90 మెట్రిక్ టన్నులు మాత్రమే వస్తున్నాయి. గత కొన్నాళ్లుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో వర్షాలు కారణంగా టమటా లేకపోవడం, కర్ణాటకలోని కోలారు, చింతామణి ప్రాంతాల్లో వైరస్ కారణంగా పంటదెబ్బతింది. ఇక తమిళనాడులోని రాయకోట, దిండిగల్, వడంలపేటలలో సీజన్ ముగిసింది. ఇక అనంతపురం జిల్లాలో వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో భారీగా సరుకు తగ్గింది. బయటి రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడి మార్కెట్‌లకు వస్తున్నారు. కావాల్సినంత సరఫరా లేకపోవడంతో ఇదే సమయంలో డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధరలు పెరుగుదలకు కారణమైంది.

**మదనపల్లె మార్కెట్‌లో ధరల వివరాలు**

| తేది | మొదటి గ్రేడ్ (10 కేజీలు) | రెండవ గ్రేడ్ (10 కేజీలు) |
|---|---|---|
| 3-10-24 | రూ.900 | రూ.800 |
| 4-10-24 | రూ.880 | రూ.800 |
| 5-10-24 | రూ.880 | రూ.800 |
| 6-10-24 | రూ.880 | రూ.800 |
| 7-10-24 | రూ.860 | రూ.780 |
| 8-10-24 | రూ.840 | రూ.780 |

**బయట ప్రాంతాలకు ఎగుమతులు**

మదనపల్లె టమటా మార్కెట్ నుంచి ప్రస్తుతం విజయవాడ, చెన్నై, రాయపూర్‌లకు వెళ్తుంది. మరో నెల రోజుల పాటు ఈ ధరలు ఉంటాయని వ్యాపారులు అంటున్నారు.

**టమాటా పంటలకు హీరోయిన్ల రక్ష**

టమాటా ధరలు అమాంతంగా పెరిగిపోతుండడంతో పంటకు దిష్టి తగలకుండా రైతులు సరికొత్త ఐడియా ఆలోచించారు. మదనపల్లెతో పాటు పలు ప్రాంతాల్లోని రైతులు టమాటా పంటపొలాల్లో సినిమా హీరోయిన్లు జాన్వీకపూర్, రకుల్ ప్రీతిసింగ్, నయనతార, తమన్నా, రష్మిక బ్యానర్లు పంట చుట్టూ పెట్టారు. దీంతో పంటపై అందరి దృష్టి పడకుండా ఉండేందుకు ఏర్పాటు చేశారు. దిష్టి తగలకుండా హీరోయిన్ల బ్యానర్లు పెట్టినట్లు రైతు వెంకటరమణారెడ్డి తెలిపారు.

## ఆర్‌జేడీగా డాక్టర్ గిరి



ఆర్‌జేడీ గిరికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధ్యాపకులు

వైవీయూ: కళాశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా డాక్టర్ డి. గిరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులో ని డి.కె. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈయన్ను కడపడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కడప నగరంలోని ఆర్‌జేడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కడప, చిత్తూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని దానికి అనుగుణంగా బాధ్యతలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆర్‌జేడీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గిరిని పలువురు అభినందించారు.

## నేటితో మద్యం షాపుల దరఖాస్తు గడువు ముగింపు



దరఖాస్తుదారులకు మద్యం పాలసీ విధానాలపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ కమిషనర్ జయరాజ్

- లాటరీ నిర్వహణకు పకడ్బందీగా సన్నాహాలు
- కడప డిప్యూటీ కమిషనర్ జయరాజ్

రాజంపేట: మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారంతో గడువు ముగుస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కడప డిప్యూటీ కమిషనర్ జయరాజ్ అన్నారు. మంగళవారం రాజంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం షాపుల విధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే విధానాన్ని కూడా ప్రభుత్వం సులభతరం చేసిందన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో మద్యం షాపుకోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే లాటరీ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదనరావు మాట్లాడుతూ లాటరీ డిప్ నిర్వహణ ప్రాంతానికి వచ్చేవారు శాఖాపరంగా మద్యం పాలసీలో పెట్టిన నిబంధనల మేరకు సిద్ధమై రావాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లిక, ఎస్‌ఐ, సిబ్బంది, దరఖాస్తుదారులు, గతంలో మద్యంషాపుల నిర్వహకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బంగారు నగలు, నగదు చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీం

**రైల్వేకోడూరు అర్బన్ :** పట్టణంలోని కొత్త కోడూరులో నివాసముంటున్న మాచిరాజు కృష్ణంరాజు, లక్ష్మీదేవి నివాసంలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు రూ.20 లక్షలు విలువ చేసే 400 గ్రాముల బంగారు, 50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఆస్పత్రి పనులపై అత్యవసరంగా అందరూ ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లారు. గంటల వ్యవధిలోనే చోరీ జరగడంపై ప్రజలు భయాందోళన చెందుతున్నారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హేమసుందర్‌రావు తెలిపారు.

### దంపతుల అదృశ్యంపై కేసు నమోదు



రెడ్డిశేఖర్ (ఫైల్)



దీప (ఫైల్)

**పీలేరు రూరల్ :** భార్యాభర్త అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పీలేరు పట్టణం కోటపల్లె క్రాస్‌కు చెందిన పి. రెడ్డిశేఖర్ (38), అయన భార్య దీప (30) కొంతకాలంగా సూపర్‌మార్కెట్‌లకు సరుకులు సరఫరా చేసేవారు. సోమవారం సాయంత్రం ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లి తిరిగి రాలేదని రెడ్డిశేఖర్ తండ్రి రెడ్డెప్పనాయుడు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ కోసం ఆధిపత్య పోరు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

**సుండుపల్లె :** మండల కేంద్రానికి సమీపంలోని పెద్దబలిజపల్లిలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ కోసం అదే గ్రామానికి చెందిన వారిమధ్య ఆధిపత్యపోరుకు దారితీసింది. దీంతో గ్రామస్తుల సమాచారం మేరకు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది మంగళవారం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గ్రామ ప్రజలు ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని, ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు మండల తహసీల్దార్, పంచాయతీ అధికారుల నిర్ణయం మేరకు స్థల పరిశీలన చేయించుకోవాలని సీఐ ఇరువర్గాలకు సూచించారు. అలా కాదని ఎవరైనా వివాదాలను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### మద్యం బాటిళ్లు పట్టివేత

**లింగాల :** లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో రూరల్ సీఐ ఎన్‌వీ రమణ ఆధ్వర్యంలో లింగాల పోలీసులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ప్రభాకర్‌రెడ్డి, శివారెడ్డి అనే వ్యక్తులు అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో వారిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న 213 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎన్‌వీ రమణ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# విశాఖ జట్టు విజయభేరి

**ప్రకాశం, చిత్తూరు జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం**



వినోద్, విశాఖ (177 పరుగులు)



రామ్‌చరణ్, విశాఖ (133 పరుగులు)



ప్రఖ్యాత్‌వర్మ, విశాఖ (5 వికెట్లు)



సాయికృష్ణ చైతన్య, కడప, (147 పరుగులు)

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–14 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖ జట్టు విజయభేరి మోగించగా, ప్రకాశం, చిత్తూరు జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. వైఎస్‌ఆర్‌ఆర్–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 112 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు రెండోరోజు మంగళవారం 68 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 426 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని రామ్‌చరణ్ 133 పరుగులు, వినోద్ 177 పరుగులతో రాణించారు. పశ్చిమగోదావరి బౌలర్ మణివర్ధన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పుగోదావరి జట్టు 34 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌట్ అయింది. విశాఖ బౌలర్లు ప్రఖ్యాత్ వర్మ 5 వికెట్లు, వినోద్ 2 వికెట్లు తీశారు. కాగా తూర్పుగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో విశాఖ జట్టు ఇన్నింగ్స్ 117 పరుగుల ఆధిక్యంతో ఘన విజయం సాధించింది.

**ప్రకాశం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..**

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండోరోజు మంగళవారం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని సాయికృష్ణ చైతన్య 147 పరుగులు, హితేష్‌సాయి 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ప్రకాశం బౌలర్లు దినేష్ 3, లోకేష్ 3 వికెట్లు తీశారు. కాగా ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 405 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, ప్రకాశం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**చిత్తూరు జట్టుకు ఆధిక్యం..**

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 132 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని శ్రీవంత్ రెడ్డి 52, తనీశ్వర్ టెండూల్కర్ 54 పరుగులు, మణిదీప్ 72 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమగోదావరి జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 38 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. జట్టులోని నారాయణ 69, సుబ్బరాయుడు 42 పరుగులు చేశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో పశ్చిమ గోదావరి జట్టు 120 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

### జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు
## వెంకటప్ప పాఠశాల విద్యార్థులు





ప్రశంసా పత్రం అందుకున్న వై.యశస్విని, కె.భార్గవి

**పులివెందుల టౌన్ :** ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ అండర్ 14, 16, 20 విభాగాలలో పులివెందులకు చెందిన వెంకటప్ప మెమోరియల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో అండర్–20లో కె.భార్గవి, 1600 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, అండర్–14లో కిడ్స్ జావెలిన్ త్రోలో వై.యశస్విని, జావెలిన్ త్రోలో సి.అంజలి, డిస్కస్ త్రోలో కె.తబిత, సాఫ్ట్‌బాల్ పోటీలో వై.బద్రీనాథ్ జాతీయ, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 17వ తేదీన గుంటూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వైఎస్సార్ ఫౌండేషన్ అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి బి.ఆర్.విజయభాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ సారా, పీఈటీ వెంకట ప్రభావతిలు అభినందించారు.

## తెలుగు గంగ కాలువలో దిగి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు సుజిత్

**మైదుకూరు :** తోడుగా వచ్చిన స్నేహితులు ఈత కొడుతుంటే తాను కూడా ఈత కొట్టాలనే ఉబలాటంతో తెలుగు గంగ కాలువలోకి దిగి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మైదుకూరు మండలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని విశ్వనాథపురం ఎస్సీ కాలనీకి చెందిన కొందరు పిల్లలు సమీపంలోని తెలుగు గంగ కాలువ వద్దకు వెళ్లారు. వారిలో సుజిత్ (14) అనే బాలుడు ఒడ్డున ఉండగా మిగిలిన వారు కాలువలో దిగి ఈత కొడుతున్నారు. ఈత కొడుతున్న వారిని చూసి తాను కూడా ఈత కొట్టాలనే ఉత్సాహంతో సుజిత్ కాలువలోకి దిగాడు. ఈత రాకపోవడంతో ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అది గమనించిన మిగిలిన వారు గ్రామానికి చేరుకుని బాలుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు బాలుడి కోసం గాలించగా కొంత దూరంలోని గేట్ల వద్ద శవమై బాలుడు కనిపించాడు. దాంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఎస్సీ కాలనీలో విషాదం అలుముకుంది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్

**సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫక్రుద్దీన్**



రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** బాధిత మహిళలకు కడపలోని వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తంగా నిలుస్తోందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని రిమ్స్ ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు ఈ కేంద్రాన్ని ఆశ్రయించవచ్చని వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నంబర్ 15100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా ఇస్రో స్పేస్ వీక్

**కడప ఎడ్యుకేషన్ :** కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రెండవరోజు కేఎస్‌ఆర్‌ఎం, ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన వరల్డ్ స్పేస్ వీక్–2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్పేస్ వెదర్ ఛేంజ్ థీమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 36 మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వక్తృత్వం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలకు డీఈఓ మర్రెడ్డి అనురాధ, నోడల్ ఆఫీసర్ టి. వి. రమణయ్య, ఇస్రో జనరల్ మేనేజర్ బాలమురళి, ఎస్‌డీఎస్‌సీ శార్, ఎస్. డిప్యూటీ జనరల్ మేనేజర్ రెడ్డెయ్యల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్‌ఎస్ మూర్తి, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ వీర శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ సురేష్ బాబు, ఈసీఈ డిపార్ట్ మెంట్ కో ఆర్డినేటర్ ఎం. ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కమలాకర్

**కడప అర్బన్ :** కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కమలాకర్‌ను నియమించారు. విశాఖ పట్టణంలోని కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కమలాకర్‌ను కడపకు బదిలీ చేశారు. ఆయన నేడో, రేపో బాధ్యతలను స్వీకరిస్తారు. కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జవహర్‌బాబును రాజమండ్రిలోని కేంద్ర కారాగారానికి బదిలీ చేశారు.

### కేజీబీవీల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**కడప ఎడ్యుకేషన్ :** ఏపీ సమగ్రశిక్ష సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ, కేజీబీవీల జీసీడీఓ విజయలక్ష్మి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందులో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ హ్యాబిటేషన్ పరిధిలో నివాసం ఉండాలని తెలిపారు. అలాగే హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదన్నారు. డే/నైట్ వాచ్ మెన్, చౌకీదార్ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు ఏడవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు apkfbv.apcfrr.in webriteతో వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

### ఆన్‌లైన్ గేమ్‌కు బానిసై.. యువకుడి ఆత్మహత్య



కార్తీక్ (ఫైల్)

**చక్రాయపేట :** మండలంలోని కె.ఎర్రగుడి గ్రామం బీఎన్ తాండాకు చెందిన ఇస్లావత్ కార్తీక్ (19) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. మృతుడి తండ్రి ఇస్లావత్ క్రిష్టా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కార్తీక్ పాలిటెక్నిక్ ఫెయిల్ అయ్యాడు. అయితే ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ ఇటీవల కొంత డబ్బు పోగొట్టుకున్న విషయం తెలిసి తల్లిదండ్రులు మందలించారు. మంగళవారం కార్తీక్ బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బు విత్‌డ్రా చేసుకొచ్చి ఇవ్వాలని తండ్రి క్రిష్టానాయక్ చెప్పడంతో సరే అని చెప్పి వెళ్లిన కార్తీక్ గ్రామ సమీపంలోని అడవిలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### వేధింపులు తాళలేక వివాహిత..

**చక్రాయపేట :** మండలంలోని అద్దాలమర్రిలో తోళ్లపల్లె గంగాసుమతి (19) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. మృతురాలి సోదరుడు జరిపిటి గురుభాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అద్దాలమర్రికి చెందిన గంగా సుమతిని శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన తోళ్లపల్లె ప్రశాంత్‌కు ఇచ్చి ఈ ఏడాది ఏప్రిల్ 12న వివాహం జరిపించారు. పెళ్లి అయినప్పటి నుంచి భర్త, అత్త వేధింపులు అధికమయ్యాయి. దీంతో ఆమె అద్దాలమర్రిలోని పుట్టింటికి వచ్చింది. భర్త, అత్త ఇద్దరూ ఫోన్ చేసి ఆమె ఆత్మహత్య చేసుకొనే విధంగా ప్రేరేపించడంతో దిక్కు తోచక ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చక్రాయపేట తహసీల్దార్ విజయకుమారి శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపికల
## షెడ్యూలు విడుదల

**ఈనెల 14 నుంచి 21 వరకు వివిధ ప్రాంతాల్లో నిర్వహణ**

**కడప స్పోర్ట్స్ :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్‌ఆర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి ఎంపికల షెడ్యూలును డీఈఓ ఎం. అనూరాధ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి విడుదల చేశారు. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అండర్–14, అండర్–17 బాల బాలికల విభాగాల్లో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దిగువ తెలిపిన కేంద్రాల్లో నిర్వహించే జిల్లాస్థాయి ఎంపికల్లో క్రీడాకారులు పాల్గొనేలా వ్యాయామ ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు.

| తేదీ | క్రీడాంశం | వేదిక |
|---|---|---|
| 14-10-24 | స్కేటింగ్ | డీఎస్‌ఏ స్కేటింగ్ రింక్, కడప |
| 15-10-24 | వాలీబాల్ | డీఎస్‌ఏ స్టేడియం, కడప |
| 15-10-24 | బ్యాడ్మింటన్ | డీఎస్‌ఏ స్టేడియం, కడప |
| 15-10-24 | చదరంగం | వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం, కడప |
| 15-10-24 | వెయిట్ లిఫ్టింగ్ | వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల, కడప |
| 15-10-24 | పవర్ లిఫ్టింగ్ | వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల, కడప |
| 16-10-24 | సాఫ్ట్‌టెన్నిస్ | డీఎస్‌ఏ స్టేడియం, కడప |
| 16-10-24 | కబడ్డీ | డీఎస్‌ఏ స్టేడియం, కడప |
| 16-10-24 | క్రికెట్ | డీఎస్‌ఏ స్టేడియం, కడప |
| 16-10-24 | ఉషు | మున్సిపల్ ఉర్దూ బాలుర హైస్కూల్, కడప |
| 17-10-24 | ఖోఖో | ఎస్.వి. హైస్కూల్, బయనపల్లి, సీకే దిన్నె |
| 17-10-24 | రగ్బీ | డా. బి.ఆర్. అంబేడ్కర్ గురుకులం, ఆడపూర్, నందలూరు |
| 18-10-24 | హాకీ | వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల, కడప |
| 18-10-24 | నెట్‌బాల్ | జెడ్పీ హైస్కూల్, రామనపల్లి, చెన్నూరు |
| 18-1024 | రోల్‌బాల్ | ఆర్‌సీపీఈ కళాశాల, ప్రొద్దుటూరు |
| 18-10-24 | క్యారమ్స్ | జెడ్పీ హైస్కూల్, నందలూరు |
| 19-10-24 | సైక్లింగ్ | కేంద్రీయ విద్యాలయ, కడప |
| 19-10-24 | రోప్ స్కిప్పింగ్ | జార్జిక్లబ్, ప్రొద్దుటూరు |
| 19-10-24 | యోగ | వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం, కడప |
| 21-10-24 | టెన్నిస్ | డీఎస్‌ఏ టెన్నిస్ కోర్ట్, కడప |



# డ్రగ్స్ పేరిట సైబర్ మోసం

**ఓ డాక్టర్ వద్ద నుంచి రూ.2 కోట్లు వసూలు**

**రాయచోటి టౌన్ :** డ్రగ్స్ ముఠాతో సంబంధాలు ఉన్నాయంటూ సైబర్ నేరగాళ్లు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ వైద్యుడిని మోసం చేసి రూ. 2 కోట్లు దోచుకున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని మాండవ్యనది ఒడ్డున ఉన్న చిన్న పిల్లల ఆసుపత్రి డాక్టర్‌కు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాము సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని చెప్పారు. మీకు డ్రగ్స్ ముఠాతో సంబంధాలున్నాయని, మీ హాస్పిటల్‌లో డ్రగ్స్ వాడుతున్నారని.. నిన్ను, నీ కుటుంబ సభ్యులను అరెస్టు చేసేందుకు తమ వద్ద అరెస్టు వారెంట్ కూడా ఉందని బెదిరించారు. కేసు నుంచి బయట పడాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బెదిరిపోయిన డాక్టర్ వారు అడిగినట్లుగానే ఆరు బ్యాంక్ ఖాతాల ద్వారా రూ. 2 కోట్లు బదిలీ చేశారు. తరువాత తాను మోసపోయానని ఆలస్యంగా తెలుసుకున్నాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సుధాకర్ తెలిపారు.

## మిద్దెపై నుంచి పడిన యువకుడు మృతి



హేమంత్‌కుమార్ (ఫైల్)

**మదనపల్లె :** మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రిలో జరిగింది. మండలంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఆనంద్, సుమతి దంపతుల కుమారుడు హేమంత్‌కుమార్(20), బెంగళూరులోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 6వతేదీన బెంగళూరులో తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్ కింది అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అక్కడి ఆస్పత్రిలో చికిత్స చేయించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బెంగళూరు వెళ్లిన కుటుంబ సభ్యులు హేమంత్‌కుమార్‌ను ఈనెల ఏడోతేదీ సోమవారం మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం తెల్లవారుజామున అతను మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

## టీడీపీ వర్గీయులపై కేసు నమోదు

**మదనపల్లె :** టీడీపీ నాయకుల అండదండలతో, భూ వివాదాన్ని అడ్డుపెట్టుకుని, ఉద్దేశపూర్వకంగా మండలంలోని వలస పల్లె పంచాయతీ అరవవాండ్లపల్లెకు చెందిన హరి భార్య శ్రావణి (25) పై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఈనెల ఆరో తేదీన ఆదివారం రాత్రి మండలంలోని వలస పల్లె పంచాయతీ అరవవాండ్లపల్లెలో టీడీపీ వర్గీయులైన పెద్ద పాపన్న, నారాయణమ్మ, పెద్ద లక్ష్మి, అదే గ్రామంలోని తమ దాయాదులైన హరి భార్య శ్రావణి(26) పై దాడి చేయడమే కాకుండా, కోడి కత్తితో విచక్షణా రహితంగా గాయపరిచారు. దాడిలో ఆమె ముఖం, శరీరం, మెడ వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం ఆమెను మెరుగైన తిరుపతికి రెఫర్ చేశారు. బాధితురాలు శ్రావణి తాలూకా పోలీసులకు తన భర్త హరి ద్వారా ఫిర్యాదు చేసింది. ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## గిరిజనులకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న సీపీఐ నాయకులు

**రాయచోటి అర్బన్ :** జిల్లాలోని కేవీపల్లె మండలం మఠంపల్లె గ్రామ పంచాయతీ కలికిరివాండ్లపల్లెలో నివాసముంటున్న గిరిజన కుటుంబాలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, పీలేరు సీపీఐ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం వారు గిరిజనులతో కలసి కలెక్టరేట్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కలిసి మాట్లాడారు. గతంలో అర్హులైన గిరిజనులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించారన్నారు. అప్పట్లో కొందరు రాజకీయ నేతలు రోడ్డుపక్కన గిరిజనులు ఉండకూడదన్న వివక్షతో అధికారుల మీద ఒత్తిడి తెచ్చి తయారైన పట్టాలను కూడా పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా గిరిజనులకు ఇళ్ల పట్టాల మంజూరుతో పాటు పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ కార్యదర్శి సుదీర్, ధర్మ, గిరిజనులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు పోటీలు

**రాయచోటి (జగదాంబసెంటర్) :** అంతర్జాతీయ బాలి కా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలను నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి యు.శివప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులకు వ్యా సరచన, పెయింటింగ్, డిబేట్ పోటీలను ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తామన్నారు. పోటీల థీమ్ సేవ్ ది గర్ల్ చైల్డ్ అని తెలిపారు. ఇది సమానత్వం, బాలికల హక్కుల రక్షణ ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతుందన్నారు.

**పోటీల వివరాలిలా..**

**1. వ్యాస రచన పోటీ**
**అంశం :** ఆడపిల్లలను రక్షించడం ప్రాముఖ్యత
**పాల్గొనేవారు :** 6–10వ తరగతుల విద్యార్థులు
**మీడియం :** ఇంగ్లీష్, తెలుగు లేదా ఉర్దూ

**2. పెయింటింగ్ పోటీ**
**థీమ్ :** ప్రతి ఆడపిల్లకీ భవిష్యత్తు
**పాల్గొనేవారు :** 1–10వ తరగతుల విద్యార్థులు

**3. డిబేట్ పోటీ**
**అంశం :** ఆడపిల్లల రక్షణ, పెరుగుదలను నిర్ధారించడంలో సమాజం పాత్ర
**పాల్గొనేవారు :** 6–10వ తరగతుల విద్యార్థులు
**మీడియం :** ఇంగ్లీష్, తెలుగు లేదా ఉర్దూ

ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 10వ తేదీన డైట్ కళాశాల ఆడిటోరియంలో స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు డైట్ లెక్చరర్ అసదుల్లాబాషా, 9440084715 నంబర్‌ను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

## ఆవుల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**కేవీపల్లె :** ఆవుల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఆమె వివరాలు వెల్లడించారు. మండలంలోని లక్ష్మిరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్ ఖాజా కేవీ పల్లె, గర్నిమిట్ట ప్రాంతంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన ఖాజా చిన్నచిన్న దొంగతనాలు చేసేవాడు. తన సమీప బంధువు అయిన పీలేరుకు చెందిన మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. ఇద్దరూ కలసి ఇటీవల లక్ష్మిరెడ్డిగారిపల్లె, కుమ్మరపల్లె ప్రాంతంలో మూడు ఆవులను చోరీ చేసి, మాయమాటలు చెప్పి అమాయకులకు విక్రయించారు. ఆ డబ్బులను విలాసాలకు ఖర్చు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ. 1.70 లక్షలు విలువ చేసే మూడు ఆవులతోపాటు రూ. 2 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది కోదండరామయ్య, ఆదినారాయణ, అల్తాఫ్ పాల్గొన్నారు.

## ఏడేళ్ల తర్వాత కుమారుడు తల్లిదండ్రులకు అప్పగింత

**కడప అర్బన్ :** అదృశ్యమైన కుమారుడిని ఏడేళ్ల తరువాత తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన కడప నగరంలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రభుత్వ బాలుర గృహంలో ఉంటున్న మహారాష్ట్రలోని ముంబయికి చెందిన యువకుడు రిత్వాన్ (16)ను అతని తండ్రి దుర్గాదాస్‌కు సూపరింటెండెంట్ వీరయ్య, తమ సిబ్బందితో కలిసి అప్పగించారు. ఈ సందర్భంగా వీరయ్య వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలుడు రిత్వాన్ 8 ఏళ్ల వయసులో ముంబయి నుంచి 2018లో అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి వివిధ ప్రాంతాలు తిరుగుతూ కర్నూలుకు వచ్చాడు. ఈ క్రమంలో 2022లో కడపలోని ప్రభుత్వ బాలుర గృహానికి పంపించారు. అప్పటి నుంచి ఇక్కడే ఉన్నాడు. ఇటీవల ఆ బాలుడికి ఆధార్ కార్డును తయారు చేయించాలని సూపరింటెండెంట్ పర్యవేక్షణలో సిబ్బంది ఆధార్ నమోదు కేంద్రానికి తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా ఆధార్ కార్డు కోసం బాలుడి చేతి వేళ్లను ముద్రించే ప్రయత్నం చేయగా.. అప్పటికే ఆధార్ కార్డు ఉందని గమనించారు. అతని తల్లిదండ్రుల వివరాలను తెలుసుకుని వారికి సమాచారం ఇచ్చారు. వారు రాగానే బాలుడిని అప్పగించారు.

## యువతి అదృశ్యంపై కేసు నమోదు

**మదనపల్లె :** యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని శేషప్ప తోట ప్రాంతానికి చెందిన ఓ యువతి (19) సెప్టెంబర్ 20వ తేదీన ఇంటి వద్దకు వెళ్లి కనిపించకుండా పోయినట్లు యువతి తల్లి మంగళవారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతి తల్లిదండ్రులు స్థానికంగా చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 20వ తేదీన తల్లిదండ్రులతో కలిసి చిల్లర దుకాణం వద్దకు వచ్చింది. అనంతరం ఇంటికి వెళ్లి టిఫిన్ తిని వస్తానని తల్లిదండ్రులతో చెప్పి వెళ్లింది. తర్వాత కనిపించకుండా పోయింది. దీంతో తల్లిదండ్రులు పలుచోట్ల గాలించారు. అయినా ఇప్పటి వరకు ఆచూకీ తెలియకపోవడంతో టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.